క్లుప్తంగా

ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం



కలిగిరి: స్థానిక ఆదర్శ పాఠశాలలో మండల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న బొటనీ ఉపాధ్యాయుడు పీ కరుణాకర్‌ను సహచర ఉపాధ్యాయులు శనివారం ఘనంగా సత్కరించారు. తొలుత సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపల్ అన్నవరం శ్రీను, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్ ప్రారంభం



సీతారామపురం : స్థానిక బిట్-1 సచివాలయంలో ఆధార్ సెంటర్‌ను ప్రారంభించారు. మండలంలో ఆధార్ సెంటర్ లేకపోవడంతో గత కొంతకాలంగా మండల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని సీతారామపురం బిట్-1 సచివాలయంలో ఆధార్ సెంటర్‌ను ప్రారంభించామని, మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సాయిప్రసాద్ కోరారు.

భూసమస్యల పరిష్కారానికి చర్యలు



ఆత్మకూరురూరల్: మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పద్మజాకుమారి ఆధ్వర్యంలో రెవెన్యూ కోర్టును శనివారం నిర్వహించారు. వెంకట్రావుపల్లి, రామస్వామిపల్లి, తదితర గ్రామాలకు చెందిన రైతుల భూసమస్యలపై తహసీల్దార్ విచారణ జరిపారు. బాధితుల వద్ద ఉన్న ఆధారాలను సేకరించారు. వాటిని ఉన్నతాధికారులకు నివేదించి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. డీటీ స్వరూప్, న్యాయవాది రామ్‌గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్లకు మరమ్మతులు

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం ఏ.కిస్తీపురం పంచాయతీ పరిధిలోని చింతలపాళెం బీసీ కాలనీలో విద్యుత్ లైన్ల మరమ్మతులను శనివారం చేపట్టారు. గత కొద్ది నెలలుగా బీసీకాలనీలో విద్యుత్ సరఫరా సక్రమంగా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రక్షిత మంచినీటి పథకాలు సైతం పనిచేయక కాలనీవాసులు తాగునీటికి అల్లాడుతున్నారు. కాలనీవాసుల ఇబ్బందులపై వరుసగా పత్రికల్లో కథనాలు రావడంతో విద్యుత్ అధికారులు స్పందించారు. విద్యుత్‌లైన్లకు మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించారు. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

9న స్పర్శ కార్యక్రమం

ఆత్మకూరు: జిల్లా సైనిక సంక్షేమ శాఖ, మాజీ సైనికుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆత్మకూరులో ఈ నెల 9న స్పర్శ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా సైనిక సంక్షేమ శాఖ ఆత్మకూరు విభాగం వారు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల రోడ్డులోని జూనియర్ కళాశాల సమీపంలోని కార్యాలయంలో మాజీ సైనికుల కుటుంబసభ్యులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మాజీ సైనికులకు సంబంధించి పింఛన్ సమస్యలు, పిల్లల పేర్లు, చిరునామాల మార్పు, పీపీఓ, మాజీ సైనికులకు గుర్తింపు కార్డులు, పిల్లలకు డిపెండెంట్ కార్డులు మంజూరు, తదితర సమస్యలపై చర్చించనున్నట్లు వివరించారు. మాజీ సైనికుల కుటుంబ సభ్యులు తప్పక హాజరుకావాలని కోరారు.

బడి ఉంటేనే బస్ సర్వీసులు

ఉదయగిరి రూరల్: ఉదయగిరి ఆర్టీసీ డిపో పరిధిలో స్త్రీశక్తి పథకం కింద మహిళల కోసం ప్రత్యేక సర్వీసులు నడపడం లేదు. పలుమార్గాల్లో స్టూడెంట్ బస్సు సర్వీసులనే స్త్రీశక్తి సర్వీసుల పేరిట కొనసాగిస్తూ మమ అనిపిస్తున్నారు. స్టూడెంట్ సర్వీసులు బడి ఉంటేనే ఆయా గ్రామాలకు వెళ్తున్నాయి. బడి లేకుంటే వాటిని డిపో అధికారులు రద్దు చేస్తున్నారు. దీంతో ఆటోలను ఆశ్రయించాల్సి రావడంతో మహిళా ప్రయాణికులు మండిపడుతున్నారు. ఉదయగిరి డిపో అధికారులు స్పందించి ప్రతిరోజూ బస్సు సర్వీసులను నడపాలని వానే కోరుతున్నారు.

ఉపాధ్యాయుడికి అభినందనలు

సోమశిల: కేంద్ర ప్రభుత్వ ఇంటిగ్రేటెడ్ ఆన్‌లైన్ గవర్నమెంట్ ట్రైనింగ్స్‌లో రికార్డు స్థాయిలో 841 కోర్సులు పూర్తి చేసిన అనంతసాగరం మండలం చిలకలమర్రి జెడ్పీ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు చల్లా చంద్రశేఖర్‌రెడ్డిని ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ, ఎంపీడీఓవిజాక్ ప్రవీణ్ అభినందించారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన గురుపూజోత్సవంలో చల్లాకు సర్టిఫికెట్‌ను అందజేశారు. ఎంఈఓలు పద్మనాభం, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

చంద్రబాబుది రైతు వ్యతిరేక ప్రభుత్వం



దుత్తలూరులో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

దుత్తలూరు: చంద్రబాబునాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం రైతు వ్యతిరేక ప్రభుత్వమని వైఎస్సార్‌సీపీ నాయకులు విమర్శించారు. ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి సూచనల మేరకు దుత్తలూరులోని జీఎస్ఆర్ ఫౌండేషన్‌లో ఎనిమిది మండలాల పార్టీ ముఖ్య నాయకులు శనివారం సమావేశమయ్యారు. ఈ నెల 9న కావలి ఆర్డీఓ కార్యాలయం ఎదుట 'అన్నదాత పోరు' పేరుతో చేపట్టనున్న నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయడంపై చర్చించారు. అనంతరం విలేకరుల సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని అన్నదాతల పాలిట చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం శాపంగా మారిందన్నారు. రైతులు సాగుచేసిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. ఖరీఫ్ పంటలు సాగుచేస్తున్న రైతులకు యూరియాను అందించకపోవడంతో వారు క్యూలైన్లు కట్టి నిరీక్షించాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఇలా క్యూలైన్‌లలో నిలుచున్న రైతులను వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెంనాయుడు భోజనం కోసం క్యూలో నిలబడినట్టే నిలబడ్డారని మాట్లాడడం వారిని అవమానించడమే అన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేసిందని గుర్తుచేశారు. ఆర్బీకేల ద్వారా రైతులకు అవసరమైన మేరకు విత్తనాలు, ఎరువులను ఇంటి ముంగిటకే సరఫరా చేసిందన్నారు. రైతులకు ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేశారని గుర్తుచేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రైతులకు పంటల బీమా, నష్టపరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ వంటి ప్రోత్సాహకాలకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. పంటలకు కావాల్సిన యూరియా సరఫరా చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోర వైఫల్యం చెందిందన్నారు. రైతులకు సొసైటీల్లో యూరియా దొరకకున్నా బ్లాక్ మార్కెట్‌లో మాత్రం అధిక రేట్లకు ఎరువుల వ్యాపారులు విక్రయిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలోని రైతుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. రైతుల పాలిట శాపంగా మారిన కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై ఈ నెల 9న కావలిలో ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాత పోరు పేరుతో చేపడుతున్న నిరసన కార్యక్రమానికి అన్ని మండలాల నుంచి భారీ సంఖ్యలో రైతులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. పార్టీ మండలాధ్యక్షులు దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, మందలపు తిరుపతినాయుడు, రేవనూరు శ్రీనివాసరెడ్డి, కాటం రవీందర్ రెడ్డి, చిమ్మిలి రవీంద్ర, ఇస్కా మదన్‌మోహన్, వెంగన్నపాళెం సర్పంచ్ తిప్పిరి బోయిన వెంగయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు పల్లాల కొండారెడ్డి, ఉదయగిరి ఏఎంసీ మాజీ చైర్మన్ అలీఅహ్మద్, సొసైటీ మాజీ అధ్యక్షులు తుమ్మల వెంగయ్య చౌదరి, రవీంద్రారెడ్డి, అక్కి భాస్కర్‌రెడ్డి, అడుసుమల్లి శ్రీహరి నాయుడు, సూరం వినోద్, మాగంటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత పోరుకు అనుమతినివ్వండి

కావలి (జలదంకి): యూరియా బ్లాక్ మార్కెట్‌పై వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 9న కావలి ఆర్డీఓ కార్యాలయం ఎదుట చేపట్టనున్న అన్నదాత పోరు కార్యక్రమానికి అనుమతినివ్వాలని కావలి పట్టణ వైఎస్సార్‌సీపీ నేతలు కోరారు. ఈ మేరకు కావలి డీఎస్పీ శ్రీధర్‌ను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ యూరియాతో సహా రైతులకు అవసరమైన ఎరువులను వెంటనే పంపిణీ చేయాలని, బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించాలని, ఎరువులను పక్కదారి పట్టిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అన్నదాత పోరుబాట చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో విఫలమైందన్నారు. రైతులకు ఉచిత పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీని అందించకుండా మోసం చేసిందన్నారు. రైతులకు అండగా వైఎస్సార్‌సీపీ చేపడుతున్న అన్నదాత పోరు కార్యక్రమంలో కావలి నియోజకవర్గంలోని రైతులు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. పార్టీ కావలి పట్టణాధ్యక్షుడు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి , జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పందిటి కామరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం ప్రసన్నాంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షుడు కనుమర్లపూడి వెంకటనారాయణ, నాయకులు నాయబ్ రసూల్, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



కావలి: కావలి డీఎస్పీకి వినతి పత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

విద్యార్థుల నైపుణ్యాలను పెంచుకోవాలి



కావలి (జలదంకి): విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకుని అత్యుత్తమ స్థాయికి ఎదగాలని ప్రముఖ మోటివేటర్, బాలమిత్ర వాసిరెడ్డి అమరనాథ్ అన్నారు. పట్టణంలోని చైతన్య జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు ప్రేరణ తరగతులను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జీవితంలో ఉన్నత స్థానానికి ఎదగాలంటే అలవర్చుకోవాల్సిన లక్షణాలపై అవగాహన కల్పించారు. వాసిరెడ్డి శిష్యులు మాధురి, మల్‌రెడ్డి, కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు పాల్గొన్నారు.

కావలి ఆర్టీఓ బాధ్యతల స్వీకరణ

కావలి (జలదంకి): కావలి ఆర్టీఓగా పీ మురళీధర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. కృష్ణా జిల్లా మచిలీపట్నం డీటీఓగా పనిచేస్తున్న ఆయన ఓడీపై కావలి ఆర్టీఓగా వచ్చారు. గతంలో కావలి ఆర్టీఓగా పనిచేస్తున్న సుధాకర్‌రెడ్డి ఉద్యోగ విరమణ పొందారు. అప్పట్నుంచి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సుందరరావు ఇన్‌చార్జి ఆర్టీఓగా వ్యవహరిస్తున్నారు. కాగా నూతన ఆర్టీఓకు ఎంవీఐ సుందరరావు, ఏఎంవీఐలు కరుణాకర్, లక్ష్మీబాయ్, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

'నక్కలగండి'లోని చిల్లకర్ర వేలం



వరికుంటపాడు: మండలంలోని నక్కలగండి రిజర్వాయర్ పరిధి చిల్లకర్ర బహిరంగ వేలం పాటను తిమ్మారెడ్డిపాళెం సచివాలయంలో శనివారం నిర్వహించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.లక్షతో వేలం పాటను ప్రారంభించగా ,పలువురు పోటీ పడడంతో పోటాపోటీగా సాగింది. చివరికి రామాపురానికి చెందిన సందిరెడ్డి నాగేశ్వరరావు రూ.4 లక్షలకు కలపను దక్కించుకున్నారు. తొలుత విరువూరు గ్రామస్తులు రిజర్వాయర్‌కు హద్దులు ఏర్పాటు చేసిన తర్వాతే వేలంపాటను నిర్వహించాలని అడ్డుకున్నారు. సర్వే నంబర్లు 517, 518లో ఉన్న 272 ఎకరాల్లో 100 ఎకరాలు కోర్టు పరిధిలో ఉన్నందున అందులోని కలపను తొలగించొద్దని అభ్యంతరం తెలిపారు. స్పందించిన ఇరిగేషన్ ఏఈ రమేష్ కోర్టు పరిధిలో లేని భూమిలోని చిల్లకర్రను మాత్రమే వేలం వేస్తున్నామని, వివాదాస్పద భూమిలోని చెట్లను తొలగించడం జరగదని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు శాంతించారు. కాగా వేంపాడు గ్రామస్తులు సాగునీటిని విడుదల చేయాలని ఏఈ రమేష్‌కు వినతిపత్రం అందజేశారు.

9న అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు



మాట్లాడుతున్న సీడీపీఓ సునీలత

ఆత్మకూరు: ఆత్మకూరు నియోజకవర్గంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకుల పోస్టులకు ఈ నెల 9న ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఐసీడీఎస్ ఆత్మకూరు ప్రాజెక్ట్ సీడీపీఓ సునీలత తెలిపారు. శనివారం ఆమె ఆత్మకూరులోని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా పోస్టులకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులైన అభ్యర్థులకు ఇంటర్వ్యూ కాల్‌లెటర్లు పంపామని తెలిపారు. కాల్‌లెటర్లు అందుకున్న వారు ఉదయం 10 గంటల నుంచి జరిగే ఇంటర్వ్యూలకు ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.

వైభవంగా గంధ మహోత్సవం



దర్గా వద్ద భక్తజన సందడి



దర్గాకు గంధాన్ని తీసుకొస్తున్న దృశ్యం

సంగం: మిలాద్-ఉన్-నబీ వేడుకల్లో భాగంగా దువ్వూరులోని ఆస్థానా ఏ నూరియాలో పీఠాధిపతి హజరత్ ఆల్‌హజ్ షేక్ షాబాషా నూరి సాహెబ్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి గంధ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. తొలుత గ్రామంలో గంధాన్ని ఊరేగించారు. అనంతరం దర్గాకు చేర్చి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి భక్తులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా పీఠాధిపతి మాట్లాడుతూ మొహమ్మద్ ప్రవక్త సందేశాలనుఅందజేశారు. దర్గా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు



సంగం: ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే ఆటోడ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ వేమారెడ్డి హెచ్చరించారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఆటో డ్రైవర్లతో సీఐ వేమారెడ్డి, ఎస్సై రాజేష్ శనివారం సమావేశమయ్యారు. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ఆటో డ్రైవర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. బస్టాండ్ సెంటర్‌లో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఆటో డ్రైవర్లు సహకరించాలన్నారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక గ్రీవెన్స్



అర్జీలు స్వీకరిస్తున్న ఆత్మకూరు ఆర్డీఓ పావని



అర్జీలు స్వీకరిస్తున్న కావలి ఆర్డీఓ వంశీకృష్ణ

కావలి (జలదంకి): గిరిజనుల సమస్యల పరిష్కారానికి ప్రతి నెలా మొదటి శనివారం ప్రత్యేక గ్రీవెన్స్‌ను నిర్వహిస్తున్నట్లుగా కావలి ఆర్డీఓ సన్నీవంశీకృష్ణ తెలిపారు. కావలి ఆర్డీఓ కార్యాలయంలో గిరిజనుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక గ్రీవెన్స్‌ను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ కావలి డివిజన్ పరిధిలోని గిరిజనులు ప్రత్యేక గ్రీవెన్స్‌ను సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. అనంతరం కావలి డివిజన్ పరిధిలోని పది మండలాల నుంచి వచ్చిన ఎస్టీల నుంచి అర్జీలను స్వీకరించారు. వివిధ సమస్యలపై 79 అర్జీలు అందాయని, వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆర్డీఓ తెలిపారు.

ఆత్మకూరు: ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయంలో గిరిజనుల సమస్యల పరిష్కారానికి శనివారం నిర్వహించిన ప్రత్యేక గ్రీవెన్స్‌కు విశేష స్పందన లభించింది. డివిజన్ పరిధిలోని మండలాల నుంచి వచ్చిన గిరిజనులు తమ సమస్యలపై అర్జీలను ఆర్డీఓ పావనికి అందజేశారు. మొత్తం 80కుపైగా అర్జీలు అందాయని ఆర్డీఓ తెలిపారు. అత్యధికంగా చేజర్ల మండల గిరిజనులు అందజేశారని వివరించారు. త్వరితగతిన అర్జీలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఏఓ రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి చేయలేక నిందారోపణలు తగవు

వింజమూరు(ఉదయగిరి): అభివృద్ధి పనులు చేసే సత్తా లేక తనపై నిందారోపణలు చేయడం తగదని ఏ కిస్తీపురం సర్పంచ్ డీ రమణారెడ్డిపై మాజీ సర్పంచ్ దాట్ల కృష్ణారెడ్డి ధ్వజమెత్తారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చింతలపాళెం బీసీ కాలనీలోని తాగునీటి సమస్యను తీర్చలేక సర్పంచ్ తనపై నిందారోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కాగా అధికార పార్టీకి చెందిన సర్పంచ్, మాజీ సర్పంచ్‌లు ఒకరిపై ఒకరు ప్రతివిమర్శలు చేసుకోవడంతో టీడీపీలోని వర్గవిభేదాలు బయటపడ్డాయి. దీంతో భవిష్యత్‌లో పంచాయతీ రాజకీయాలు ఎలాంటి పరిస్థితులకు దారితీస్తాయోనన్న చర్చ మొదలైంది.

నేడు వెంగమాంబ ఆలయం మూత

దుత్తలూరు: చంద్రగ్రహణం సందర్భంగా నర్రవాడ వెంగమాంబ పేరంటాలు దేవస్థానాన్ని ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సోమవారం ఉదయం ఐదు గంటల వరకు మూసివేస్తున్నట్లు ఆలయ ఈఓ వీ ఉషశ్రీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట వరకు మాత్రమే భక్తులకు దర్శనం కల్పించడం జరుగుతుందన్నారు. ప్రతి ఆదివారం నిర్వహించే మధ్యాహ్నం అన్నదానాన్ని నిలిపివేసినట్లు తెలిపారు. సోమవారం ఉదయం ఆలయ శుద్ధి, సంప్రోక్షణ అనంతరం 8 గంటల నుంచి భక్తులకు దర్శనం కల్పించడం జరుగుతుందన్నారు. భక్తులు గమనించాలని కోరారు.

మద్యం దుకాణాల్లో తనిఖీలు

సీతారామపురం : స్థానిక మద్యం దుకాణాలను ఉదయగిరి ఎక్సైజ్ సీఐ లక్ష్మణస్వామి శనివారం తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేసి నిల్వలను నిశితంగా పరిశీలించారు. మద్యం దుకాణాల నిర్వహణలో సమయాన్ని పాటించాలని, ఎమ్మార్పీకే విక్రయించాలన్నారు. బెల్టుషాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట ఎక్సైజ్ సిబ్బంది ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఉదయగిరి: స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్ వద్ద శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. వివరాలు.. వైఎస్సార్ జిల్లా బద్వేల్‌కు చెందిన వేణుగోపాల్ పని నిమిత్తం మోటార్‌సైకిల్‌పై ఉదయగిరి వచ్చి తిరిగి వెళుతుండగా, బస్టాండ్ సెంటర్ వద్ద మోటార్ సైకిల్‌పై వస్తున్న విద్యార్థి ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో వేణుగోపాల్ కాలికి తీవ్రగాయం కాగా, విద్యార్థికి స్వల్ప గాయాలయ్యాయి. వేణుగోపాల్‌ను చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం ఆత్మకూరు జిల్లా వైద్యశాలకు తరలించారు.

క్షుద్రపూజల కలకలం

దుత్తలూరు: దుత్తలూరు పంచాయతీ పరిధిలోని కట్టకిందపల్లి ఎస్సీకాలనీలో శనివారం క్షుద్ర పూజల కలకలం నెలకొంది. ఎస్సీ కాలనీలోని అందె వరాలు అనే వ్యక్తి ఇంటి ముందు శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చిన్నపాటి బొమ్మ గీసి పసుపు, కుంకుమతో పూజలు చేశారు. శనివారం ఉదయం ఓ మహిళ గుర్తించి ఇంటి యజమాని వరాలుకు విషయం తెలిపింది. అతను ఇంటి బయటకు వచ్చి చూసి భయపడి పోలీసులకు సమాచారం అందజేశారు. ఏఎస్సై ఇస్మాయిల్ ఘటనా స్థలానికి చేరుకుని స్థానికులను విచారించారు. ఈ ఘటనతో తీవ్ర భయాందోళనలకు గురవుతున్నామని, ఈ చర్యలకు పాల్పడిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

క్విజ్ పోటీలు

ఉదయగిరి రూరల్: మండలంలోని పుల్లాయపల్లె ప్రాథమికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు హెచ్‌ఎం సుబ్బారెడ్డి శనివారం క్విజ్ పోటీలు నిర్వహించారు. నోబ్యాగ్స్ డే సందర్భంగా ఇప్పటి వరకు జరిగిన సబ్జెక్టులపై విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేసినట్లు ఆయన తెలిపారు.

భక్తిశ్రద్ధలతో నవదిన ఉత్సవాలు



సీతారామపురం : స్థానిక అరుంధతీయవాడలో వేళాంగిణి మాత నవదిన ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా వేలాంగణి మాత మండపాన్ని ప్రత్యేకంగా అలంకరించి మాత స్వరూపాన్ని ఊరేగించారు. నల్గొండ మేత్రాసనం విచారణ గురువులు యోహాను ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

గురువులు సమాజ నిర్దేశకులు



మర్రిపాడులో మండల ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం



చేజర్లలో మండల ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం



సీతారామపురంలో మండల ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

ఆత్మకూరు: గురువులు సమాజ నిర్దేశకులని పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలోని శ్రీధర్ గార్డెన్స్‌లో ప్రైవేట్ పాఠశాల అసోసియేషన్ (అపస్మా) ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని 16 పాఠశాలల నుంచి 36 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి ఘనంగా సన్మానించారు. ఆత్మకూరు నియోజకవర్గ అపస్మా అధ్యక్షుడు కే కోటేశ్వరరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి రాష్ట్ర సీనియర్ ఉపాధ్యక్షుడు నేతాజీ సుబ్బారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఉపాధ్యాయులను సత్కరించారు. అనంతరం నేతాజీ సుబ్బారెడ్డిని ఘనంగా సన్మానించారు. ఆత్మకూరు ఎంపీపీ వేణుగోపాల్ రెడ్డి, అపస్మా జిల్లా అధ్యక్షుడు ఎస్ శ్రీధర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్‌వీ రమణారెడ్డి, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ జీ ప్రభాకర్, జిల్లా సెక్రటరీ ఎస్ రామ్మోహన్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు టీసీ వెంకట సుబ్బయ్య, సెక్రటరీ పీ మల్లికార్జున, గార్ల సురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్: వెంకట్రావుపల్లి పాఠశాలలో హెచ్‌ఎం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. 'మన ఫౌండేషన్' అధినేత మన్నేటి వెంకటరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయులను సత్కరించారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

సీతారామపురం : స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను శనివారం నిర్వహించారు. మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వెంకటసుబ్బయ్య, ఏవీ రమణయ్య, మెహతాజ్, భావన, సునీత, ముజిబా తబసుమ్, శ్రీనివాసులు, రంతుజాని, సురేష్, సువర్ణ, వెంకటేశ్వర్లు, సుధాకర్‌రాజు, సుబ్బారావు, లలితాకుమారి, షబ్బీర్‌అహ్మద్‌ను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. తొలుత సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బిట్-1 ఎంపీటీసీ పీసీ అల్లూరురాజు, సర్పంచ్ భాగ్యకుమారి, ఎంఈఓ మస్తాన్‌వలి, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ సమీరారెడ్డి, కేజీబీవీ ఎస్ఓ షాహీదా, తదితరులు పాల్గొన్నారు.

చేజర్ల(సోమశిల): చేజర్ల మండల పరిషత్ కార్యాలయంలో మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహించారు. మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా 16 మందిని ఎంపిక చేసి పురస్కారాలను అందజేసి సత్కరించారు. ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీడీఓ అమర్, మాజీ ఎంపీపీ రావి పెంచలరెడ్డి, బాలిరెడ్డి రమాదేవి, లక్ష్మీనరసారెడ్డి, వీరరాఘవరెడ్డి, డీసీ మస్తానయ్య, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మర్రిపాడు: మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను శనివారం నిర్వహించారు. ఎంఈఓ-1 తిరుపతయ్య మాట్లాడుతూ భావిభారత పౌరులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిదన్నారు. అనంతరం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత దొంతు రత్నయ్య, ఉత్తమ సేవాపురస్కారాన్ని అందుకున్న ఎంఈఓ-2 ధనలక్ష్మి, మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఎం సుధాకర్, పీ పద్మలత, ఆర్ శ్రీనివాసులు, కె.హరికృష్ణ, ఎస్ శంకర్, సీహెచ్ వెంకట రమణయ్య, పీ నాగరాజు, ఎం మంజుల, బీ పద్మమ్మ, పీ వెంకటరెడ్డి, అబ్దుల్ మునాఫ్, జె పద్మ, ఈ మౌనిక బీ వెంకటేశ్వరరాజు, షేక్ జిలాని, పీ అహల్యారాణి, బీ అపర్ణ, షేక్ సాబీహ, షేక్ మహమ్మద్‌రఫీ, కే పెంచలయ్య, బీ వెంకటేశ్వర్లు, టీ సుధాకర్‌రావు, ఈ భాగ్యమ్మను ఘనంగా సన్మానించారు. కదిరినాయుడుపల్లికి చెందిన గంగిరామ చారిటబుల్ ట్రస్ట్ వారు జ్ఞాపికలు, శాలువాలు, పూలమాలలు అందజేశారు. బ్రాహ్మణపల్లి, పోలిరెడ్డి ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు శ్రీనివాసులు, మస్తాన్, ఉపాధ్యాయులు, సీఆర్‌ఎంటీలు, ఆఫీస్ సిబ్బంది, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరులో ఉపాధ్యాయినికి సత్కారం



ఉదయగిరిరూరల్: సర్వేపల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మన్నేటి

'నమస్తే'ను సద్వినియోగం చేసుకోవాలి



నమస్తేపై అవగాహన కల్పిస్తున్న రాష్ట్ర కోఆర్డినేటర్ మారుతీప్రసాద్

ఆత్మకూరు: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'నమస్తే'ను (నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకోసిస్టం) సద్వినియోగం చేసుకుని యాచకులు ఆత్మగౌరవంతో జీవించాలని మున్సిపల్ కమిషనర్ సీ గంగాధర్ అన్నారు. మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో నవజీవన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నమస్తేపై యాచకులకు అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ భిక్షాటనను నిర్మూలించేందుకు నమస్తే పథకం దోహదపడుతుందన్నారు. నవజీవన్ సంస్థ స్టేట్ కోఆర్డినేటర్ మారుతి ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నమస్తే పథకం కింద మున్సిపల్ పరిధిలో చెత్త ఏరుకునే, డంపింగ్ యార్డులో పనిచేసే శానిటరీ పనులు చేసే వారికి, చిక్కు వెంట్రుకలు సేకరించే వారిని గుర్తించి వారికి ఆరోగ్య బీమా పథకాన్ని వర్తింపజేయనున్నట్లు తెలిపారు. 60 ఏళ్లు పైబడిన వారికి పింఛన్ పథకాన్ని అమలు చేయనున్నట్లు చెప్పారు. పారిశుధ్య కార్మికులు 'నమస్తే' పథకంలో పేర్లు నమోదు చేసుకుని లబ్ధి పొందాలని సూచించారు. సంస్థ ఆత్మకూరు బాధ్యులు వాగాల శ్రీహరి, పీ కృష్ణ, నాయబ్ రసూల్, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ శిరీషా, ఏఈలు పాల్గొన్నారు.

యాదవపాళెంలో తాగునీటి ఎద్దడి

ఉదయగిరి: పట్టణంలోని యాదవపాళెంలో తాగునీటి ఎద్దడి నెలకొంది. మంచినీటి పథకం మోటార్‌కు విద్యుత్‌ను సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురవడంతో తాగునీటి సమస్య నెలకొంది. పంచాయతీ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో పది రోజులుగా కుళాయిల ద్వారా తాగునీరు సరఫరావక తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.